## క్లుప్తంగా

### చలివేంద్రం ప్రారంభం



**చినకాకాని (మంగళగిరి):** నగర పరిధిలోని చినకాకానిలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ స్థానిక నాయకుడు థామస్ మేస్త్రీ ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాలి వెంకట కృష్ణ, ఎం.కాంతారావు, మర్రి వెంకయ్య, నాగరాజు, డి.గోపి, గుత్తికొండ సీతారామిరెడ్డి, ఎం.చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.

### సామాజిక బాధ్యతతో మెలగాలి




**చినకాకాని (మంగళగిరి):** విపత్కర పరిస్థితులలో సామాజిక బాధ్యతతో మెలుగుతూ ప్రజలకు అండగా నిలవడమే జన సేవాదళ్ లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. నగర పరిధిలోని చినకాకానిలో పది రోజులుగా సాగుతున్న జన సేవాదళ్ శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ.. పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 26వ తేదీన పండుగలా వేడుకలు జరుపుకోవాలన్నారు. దేశంలో నెలకొన్న ప్రమాదకర పరిస్థితులలో రెడ్ షర్ట్ వలంటీర్‌ల సేవలు ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిన్ని తిరుపతయ్య, గుజ్జుల ఈశ్వరయ్య, కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, అన్నవరపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### పీహెచ్‌సీకి సామగ్రి వితరణ



**తాడేపల్లి రూరల్:** తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో కంప్యూటర్, ఏసీ, వాటర్ కూలర్, బీరువా, ఇతర ఫర్నిచర్‌ను ఆదివారం రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సర్వీస్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ జొన్న రాజేష్, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్ష, కార్యదర్శులు రావూరి రమేష్‌బాబు, సెక్రటరీ సుకుమార్ రెడ్డిలు మాట్లాడుతూ గతంలో ఇందిరానగర్, కుంచనపల్లి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకూ సామగ్రి అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ గవర్నర్ పి.శివరంజని, మాజీ అసిస్టెంట్ గవర్నర్ వంశీకృష్ణ, మున్నంగి వివేకానంద రెడ్డి, చంద్ర ఓబులా రెడ్డి, కిరణ్ కుమార్, కాట్రగడ్డ శివనారాయణ, రవీంద్రరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, జొన్న కిషోర్, డి. వెంకట నరసింహం, నరేంద్ర, అమరేంద్ర, తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శాంతి, అనూష, హెల్త్ సూపర్‌వైజర్ రమాదేవి, స్టాఫ్ నర్స్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

### వీసీకి అభినందన



**మంగళగిరి టౌన్:** ఇటీవల కర్నూలు–రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా నియమితులైన ఉడతా వెంకట బసవరావును ఆదివారం ఆయన నివాసంలో స్థానిక ఆధ్యాత్మిక, ధార్మిక సంఘాల ప్రతినిధులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వెంకట బసవరావు దంపతులను శాలువాలతో సత్కరించారు. మంగళగిరి పట్టణానికి చెందిన వెంకట బసవరావు వీసీగా నియమితులు కావడం పద్మశాలీయ సామాజిక వర్గానికి ఎంతో సంతోషంగా ఉందన్నారు. వీసీగా బసవరావు సారథ్యంలో యూనివర్సిటీ పరిధిలో విద్యాప్రమాణాలు పెరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్ల భక్తబృందం కమిటీ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఫణిదపు శ్రీనివాసరావు, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి రథచప్టాల బృందం సభ్యులు నందం శ్రీనివాసరావు, ఆంజనేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

### వివాహ పరిచయ వేదికకు స్పందన

**తెనాలిరూరల్:** పట్టణానికి చెందిన ది పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక ముత్తెంశెట్టిపాలెంలోని పద్మశాలియ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి సుమారు 600 మంది హాజరయ్యారు. తొలుత వివాహ పరిచయ వేదిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. సొసైటీ అధ్యక్షుడు జె. నరసింహారావు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

# 'ప్లాస్టిక్' తప్పు.. మేలుకోకుంటే ముప్పు!

నేటి ఆధునిక యుగంలో ప్రజలు వాడే ప్లాస్టిక్ భవిష్యత్తు తరాలకు శాపంగా మారుతోంది. ఈ– వేస్ట్ కూడా పర్యావరణానికి పెనుప్రమాదం అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పర్యావరణానికి కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. లేదంటే భవిష్యత్తు తరాలు క్షమించవని పర్యావరణ ప్రేమికులు కూడా పేర్కొంటున్నారు

- నిషేధిత ప్లాస్టిక్ వినియోగంతో ఆందోళనకర పరిస్థితులు
- అందరికీ పర్యావరణ పరిరక్షణ బాధ్యత అవసరం
- భవిష్యత్తు తరాల కోసం తప్పదంటున్న నిపుణులు
- ప్రత్యేక కార్యక్రమాలంటూ హడావిడికే యంత్రాంగం పరిమితం
- తర్వాత అటువైపు కూడా చూడని అధికారగణం



దుకాణాలలో విక్రయిస్తున్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు (ఫైల్)

**మంగళగిరి :** ప్రభుత్వం సైతం ఏదో మొక్కుబడిగా స్వచ్ఛత, శుభ్రత అంటూ అప్పుడప్పుడు ఏటా ఒక వారం హడావిడి చేయడం తగదన్నదని పర్యావరణవేత్తల అభిప్రాయం. అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యావరణాన్ని రక్షిస్తున్నట్లు రోడ్లు ఊడ్చడం, చెత్త ఎత్తడం వంటి ఫొటోలు దిగి ప్రచారం చేసుకోవడానికే చాలావరకు పరిమితం అవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. కానీ సమస్య శాశ్వత పరిష్కారానికి నిబద్ధతతో పనిచేయడం లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

**పెద్ద దుకాణాల్లోనే విక్రయాలు**

ప్లాస్టిక్ నిషేధించామని చెప్పి ప్రభుత్వం చేతులు దులుపుకొంటోంది. ప్లాస్టిక్ కవర్ల విక్రయాల నివారణకు తగిన చర్యలు తీసుకోకపోవడం , మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలలో అధికారులు ఏదో కంటి తుడుపు చర్యగా దుకాణాలలో ఏడాదికోసారి తనిఖీలు నిర్వహించడం సర్వసాధారణమైంది. ప్లాస్టిక్ కవర్లను దహనం చేయడం, జరిమానాలు విధించడం వంటివి చేస్తున్నారు. అధికారులు తనిఖీ చేస్తారని తెలిసినా ఒకటి రెండు రోజులు దుకాణాలలో ప్లాస్టిక్ కవర్లు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. అధికారులు మాత్రం పొట్టకూటి కోసం తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే వారికి జరిమానాలు విధిస్తున్నారు. కవర్లు విక్రయించే దుకాణాల జోలికి వెళ్లకపోవడం విశేషం. ప్రజాప్రతినిధులు, అధికారులు నామమాత్రంగా చర్యలు తీసుకోవడానికే పరిమితం కాకూడదని ప్రజలు కోరుతున్నారు. ప్రజలలో పూర్తి స్థాయిలో అవగాహన కలిగించి ప్లాస్టిక్, ఈ –వేస్ట్ వంటి వాటి వల్ల భవిష్యత్తు తరాలు నష్టపోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

### కఠిన చర్యలు తీసుకుంటాం



ఎంటీఎంసీ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ–వేస్ట్‌పై ప్రజలలో మరింత అవగాహన కల్పించాల్సి ఉంది. పర్యావరణానికి జరిగే ముప్పుపై వారికి వివరిస్తాం. నగరాన్ని ప్లాస్టిక్, ఈ–వేస్ట్ రహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం.

– అలీంబాషా, కమిషనర్, ఎంటీఎంసీ

### ఎన్నో ఇబ్బందులు



ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ విషయం తెలిసి కూడా వాటిని వాడుతున్నారు. ప్రతి ఒక్కరు చైతన్యవంతులై ప్లాస్టిక్ నిషేధానికి సహకరిస్తేనే ఫలితం ఉంటుంది. పాఠశాలల్లో, కళాశాలల్లో ప్లాస్టిక్, ఈ– వ్యర్థాల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. వారి ద్వారా తల్లిదండ్రులలో చైతన్యం చేయొచ్చు.

– రత్నబాబు, ప్రైవేటు కళాశాల ప్రిన్సిపల్

### వాడకంతో ప్రాణాంతక వ్యాధులు

ప్లాస్టిక్ వినియోగంతో క్యాన్సర్‌తోపాటు జీర్ణకోశ సంబంధిత వ్యాధులు సంక్రమిస్తాయి. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి. ఈ–వేస్ట్‌ను నగర పాలక పారిశుద్ధ్య సిబ్బందికి అప్పగించాలి. వీటివల్ల పర్యావరణానికి కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

– డాక్టర్ స్నేహరాజ్, ప్రభుత్వాసుపత్రి

### బయట ఆహారప్యాకెట్ల ద్వారా చేటు



ప్లాస్టిక్ తయారీలో రసాయనాలను వినియోగిస్తారు. వీటి వలన క్యాన్సర్ వచ్చే ప్రమాదముంది. హోటల్స్‌లో వేడిగా ఉన్న పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో పార్సిల్ చేసి విక్రయిస్తున్నారు. దీని వలన వేడికి కవర్లు కరిగి వాటిలోని రసాయనాలు ఆహార పదార్థాలలో కలుస్తున్నాయి. దీని వలన శ్వాస, చర్మ సంబంధమైన వ్యాధులు సంక్రమిస్తాయి. మహిళల్లో గర్భస్రావం, రుతు సమస్యలు వస్తాయి.

– డాక్టర్ పి.అనూష, మెడికల్ ఆఫీసర్, ఇందిరానగర్ యూపీహెచ్‌సీ

# లైబ్రరీ, స్టడీ సెంటర్ ప్రారంభం



లైబ్రరీ అండ్ స్టడీ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న డాక్టర్ సురేష్

**తాడేపల్లి రూరల్:** మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రకాష్ నగర్‌లో ఐన్‌స్టీన్ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన భగత్‌సింగ్ లైబ్రరీ అండ్ స్టడీ సెంటర్‌ను ఆదివారం ప్రోగ్రెసివ్ డాక్టర్స్ లీగ్‌లో మెంబర్ డాక్టర్ సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐన్‌స్టీన్ అభివృద్ధి చేసిన సాపేక్ష సిద్ధాంతం సైన్స్ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడిందని అన్నారు. ఐన్‌స్టీన్ శాంతిని కోరుకోవడమే కాకుండా యుద్ధాలకు మూలాలు ఈ వ్యవస్థలోనే ఉన్నాయని గుర్తించారని అన్నారు. భగత్ సింగ్ దేశంలో ప్రజలకు నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం రావడానికి పోరాడారని తెలిపారు. యువత, విద్యార్థులు నిత్యం చైతన్యంగా ఉండాలని సూచించారు. మాజీ సైనికోద్యోగి గోపాలం సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి అంశాన్ని ప్రశ్నించాలని అన్నారు. పుస్తకాలను చదవడం అలవర్చుకోవాలని సూచించారు. లైబ్రరీ అండ్ స్టడీసెంటర్ నిర్వాహకులు ప్రొఫెసర్ బూరగ శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లల్ని తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని అన్నారు. దర్శి నరసింహారావు మాట్లాడుతూ లైబ్రరీలో వివిధ కవుల రచనలు చదవడం, సైన్స్ ప్రయోగాలు, నాటికలు, విహార యాత్రలు, ఆర్ట్, మంచి సందేశాలు వివిధ రకాల కార్యక్రమాలు ఉంటాయని అన్నారు.

# పాస్టర్ ప్రవీణ్ కేసులో ఎన్నో అనుమానాలు

- త్వరలో జేఏసీగా కోర్టు ద్వారా ముందుకు వెళతాం
- లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

**తాడేపల్లి రూరల్:** పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరఫున కోర్టులో పిల్ వేస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం తాడేపల్లిలోని ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. అందరితో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేస్తామని, కోర్టు ద్వారా న్యాయం కోసం ముందుకు వెళతామని అన్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల పోస్టుమార్టం రిపోర్ట్‌లో స్పష్టత లేదని విమర్శించారు. ప్రయాణం చేసింది, ఆగింది, మద్యం కొనుగోలు చేసింది ప్రవీణ్‌కుమార్ అని ఎక్కడా నిరూపణ కాలేదన్నారు. చనిపోయిన వ్యక్తి ప్రవీణ్‌కుమార్ అనేది తప్ప పోలీసులు చూపిన వీడియోల్లో ఆయన ప్రవీణ్‌కుమార్ అని నిర్ధారణ కాలేదన్నారు. తనకు ఎన్నో పోస్టుమార్టం రిపోర్టులు చూసిన అనుభవం ఉందని, మద్యం తాగడం వల్లే మృతి చెందాడంటూ పోస్టుమార్టం రిపోర్ట్‌లో కావాలని రాసినట్లు ఉందని అన్నారు. మద్యం వల్లే చనిపోతే ఈ దేశంలో, రాష్ట్రంలో ఇంతమంది ఎలా బతికి ఉన్నారని ప్రశ్నించారు. ప్రిలిమినరీ రిపోర్ట్‌లో 120 ఎంఎల్ ఫ్లూయిడ్ ఉందని రిపోర్ట్ ఇచ్చారని, ఈ ఫ్లూయిడ్‌లో అనుమానాస్పదమైన ఆల్కహాల్ లేదని ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రిలిమినరీ రిపోర్ట్‌లో ఆల్కహాల్ లేదని చెప్పిన వైద్యులు ఫైనల్ రిపోర్టులో ఆల్కహాల్ ఉందని ఇవ్వడం చిత్రంగా ఉందన్నారు. ఎందుకు ఆల్కహాల్ గురించి ఇంతగా ప్రస్తావిస్తున్నారు. పోలీసులు మొదట చెప్పిన ప్రెస్‌మీట్‌లో ఎక్కడా ఆల్కహాల్ గురించి ప్రస్తావన లేదన్నారు. పనిగట్టుకుని మరీ ఆల్కహాల్ ఉందని రిపోర్టులు రాశారని అనిపిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. ఏపీలో అసలు మానవ హక్కులు ఉన్నాయా అని ప్రశ్నించారు. స్వేచ్ఛగా నిరసన తెలిపే హక్కు ఒక పౌరునికి లేకపోవడం, రెండుసార్లు ఎంపీగా చేసిన హర్షకుమార్‌ను అరెస్ట్ చేసి వేధించడం ఎంతవరకు సబబు అని అన్నారు. మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్న కొద్దీ ప్రవీణ్‌కుమార్‌ది హత్యే అని అనుమానాలు బలపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రవీణ్ మృతిపై మాట్లాడాలంటేనే భయపడేలా చేస్తున్నారని విమర్శించారు.

# క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న సంఘం నాయకులు


**తాడికొండ:** క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళకు ఆర్థిక సాయం అందించారు. తాడికొండ మండలం మోతడక గ్రామానికి చెందిన కొల్లిపాక స్వాతికి ఏపీ కుమ్మర శాలి వాహన సంఘం ప్రతినిధులు రూ. 27 వేలను అందజేశారు. దాతలు ఆకారపు శ్రీనివాస్, దండు లక్ష్మీప్రసన్న, చేపత్తి లక్ష్మీదుర్గ, జిల్లా కమిటీల ద్వారా ఈ మొత్తం సేకరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐలాపురం వెంకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలాపురం భాస్కర శ్రీనివాస్ చేతుల మీదుగా స్వాతికి అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ, ఉపాధ్యక్షుడు ఆకారపు అంకమ్మరావు, యువజన విభాగ అధ్యక్షుడు మామిళ్ళ పల్లి సుబ్బారావు, ఎ పూర్ణచంద్రరావు, రాజవరపు సుబ్బారావు, సీహెచ్ కోటేశ్వరరావు, ఇ.హనుమంతరావు, కె.వెంకటేశ్వర్లు, ఆకారపు సాంబయ్య, సీహెచ్ కాశయ్య, జి.ఏడుకొండలు, ఎం.రాంబాబు, అప్పారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

- వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ డిమాండ్
- నేడు అధికారులకు వినతిపత్రం అందజేత

**తాడేపల్లి రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందజేయాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేయనున్నారు. ఈ మేరకు యూనియన్ మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షుడు పులగం సందీప్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, ఇతర నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. నియోజవర్గంలోని నాయకులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# 4న తెనాలిలో అన్నమయ్య పాటల పోటీలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సంకీర్తన సేవా బృందం

**తెనాలి టౌన్:** శ్రీ వేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవా బృందం తెనాలి ఆధ్వర్యంలో మే 4వ తేదీన పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అన్నమయ్య పాటల పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలియజేశారు. ఆదివారం స్థానిక బోసురోడ్డులోని దేవాలయంవద్ద కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వాసవీ అమ్మవారి దేవస్థానంలోని గీతామందిరంలో అన్నమయ్య పాటల పోటీలు జరుగుతాయని చెప్పారు. 8 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల లోపు ఎవరైనా పోటీల్లో పాల్గొన్న వచ్చని తెలిపారు. జూనియర్–1 విభాగం 8 సంవత్సరాల నుంచి 13 సంవత్సరాల వరకు, జూనియర్–2 విభాగం 14 సంవత్సరాల నుంచి 20 సంవత్సరాల వరకు, సీనియర్–1 విభాగం 21 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలు, సీనియర్–2 విభాగం 36 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల వరకు పాటల పోటీలు జరుగుతాయని చెప్పారు. జూనియర్ విభాగాలకు ఒక్కొక్కదానికి మొదటి బహుమతి రూ.1000, రెండోవ బహుమతి రూ.500, మూడో బహుమతి రూ.300లు, జూనియర్–1 విభాగానికి10 మందికి ప్రోత్సాహక అందిస్తామని తెలిపారు. సీనియర్ విభాగానికి మొదటి బహుమతి రూ.500, రెండోవ బహుమతి రూ.300, మూడోవ బహుమతి రూ.200లు నిర్ణయించినట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు 9246440685 వాట్సాప్ నెంబర్‌కు తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సంప్రదాయ దుస్తులు ధరించాలని తెలిపారు. పోటీలు ప్రతిఒక్కరిలో భక్తి భావం పెంపొందించేందుకు నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సభ్యులు ఎ.బాలచంద్రమౌళి, తన్మయి, వి.ఉమామహేశ్వరరావు, లక్ష్మీ సరోజిని, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

### చలివేంద్రాల్లో మజ్జిగ పంపిణీ

**తెనాలిఅర్బన్:** చలివేంద్రాల్లో మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని హ్యాపీ హాస్పటల్ నిర్వాహకులు డాక్టర్ పావని ప్రియాంక పేర్కొన్నారు. శ్రీ శివలింగేశ్వస్వామి భక్త బృంద సేవా సమితి ఆధ్వర్యంలో సాయిబాబా గుడి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ఆదివారం మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు కుర్రా శ్రీనివాసరావు, షేక్ మీరావలి, ఎస్ ఆర్‌కె శర్మ, శ్రీను, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

+ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి భక్త బృంద సేవా సమితి ఆధ్వర్యంలో రజకపేటలో ఆదివారం మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సభ్యులు ఉప్పలపాటి సాయికృష్ణ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగను పంపిణీ చేసినట్లు చెప్పారను. కార్యక్రమంలో పెసర్లంక రమణ, ఎ.సాయిరామ్, పి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**తెనాలిటౌన్:** బాటసారుల వేసవి దాహార్తినీ తీర్చేందుకు చలివేంద్రం సేవలు దోహదపడతాయని శ్రీ ఆంజనేయ ధ్యాన యోగ మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మారీసుపేటలోని అప్పలస్వామి గుడి వద్ద ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు.

# భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు

**ఫిరంగిపురం:** ప్రజల పాపాలను ప్రక్షాళన చేసేందుకు ఏసుక్రీస్తు మరణించిన తరువాత పునరుత్థానం చెందాడని గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. మండల కేంద్రంలోని బాలఏసు దేవాలయంలో శనివారం అర్ధరాత్రి క్రీస్తు పునరుత్థాన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాక్యోపదేశం చేస్తూ.. మానవాళి పాపాలను ప్రక్షాళన చేసేందుకు మరియమాత గర్భాన ఏసు జన్మించాడని చెప్పారు. ఎన్నో మానవాతీత కార్యాలు చేశాడన్నారు. ప్రతి ఒక్కరూ క్రీస్తుపై విశ్వాసం, భక్తి, ప్రేమతో ఉండాలని పేర్కొన్నారు. మరణించిన తర్వాత మూడోరోజు క్రీస్తు సజీవంగా లేచాడన్నారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి, సహాయ గురువులు బి.ప్రవీణ్‌కుమార్, రవీంద్ర, మఠకన్యస్త్రీలు, గుడి పెద్దలు, కథోళిక క్రైస్తవులు పాల్గొన్నారు.

**తాడికొండలో...**

**తాడికొండ:** ఈస్టర్‌ను పురస్కరించుకొని తాడికొండ, తుళ్ళూరు మండలాల్లో ప్రార్థనలు నిర్వహించారు. తాడికొండతోపాటు లాం, పొన్నెకల్లు, నిడుముక్కల, మోతడక, తుళ్ళూరు, కంతేరు, లచ్చన్నగుడిపూడి, రావెల, పాములపాడు, బండారుపల్లి, దామరపల్లి, గరికపాడు, మందడం, వెలగపూడి, రాయపూడి తదితర గ్రామాల్లోని చర్చిలు భక్తులతో కిటకిటలాడాయి.

**మంగళగిరి టౌన్:** ఈస్టర్‌తో క్రీస్తు మానవాళికి రక్షణ మార్గం చూపారని పలువురు పాస్టర్లు చర్చిలలో క్రైస్తవులకు సందేశాన్ని ఇచ్చారు. మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. తెల్లవారుజామున పెద్దల సమాధుల వద్దకు వెళ్లిన క్రైస్తవులు సమాధులను పూలతో అలంకరించారు. చర్చిలలో చిన్నారులు లఘునాటికలు ప్రదర్శించారు. పాత మంగళగిరి లూథరన్ చర్చి, మంగళగిరి టౌన్ చర్చి, పార్కు రోడ్డులోని ఇమ్మానియేల్ చర్చి, తాడేపల్లిలోని పలు చర్చిలలో పాస్టర్లు సందేశాన్ని ఇచ్చారు.

**దుగ్గిరాలలో..**

**దుగ్గిరాల:** క్రీస్తు పునరుత్థానం సందర్భగా చర్చిలలో ప్రార్థనలు జరిగాయి. దుగ్గిరాల మండలంలోని చిలుపూరు, తుమ్మపూడి తదితర గ్రామాలలో భక్తిశ్రద్ధలతో ఆదివారం తెల్లవారుజామునే పలు చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పాస్టర్లు వాక్యోపదేశం చేశారు.



ఫిరంగిపురం: దివ్యపూజాబలి నిర్వహిస్తున్న మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య



మంగళగిరి: టౌన్ చర్చిలో సందేశాన్నిస్తున్న పాస్టర్లు



మంగళగిరి: పార్కురోడ్డులో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో క్రైస్తవులు



తాడికొండ: లూథరన్ చర్చిలో బోధిస్తున్న పాస్టర్ నల్లపు సుధాకర్ రావు



మంగళగిరి: రొట్టె, ద్రాక్షరసం అందిస్తున్న పాస్టర్లు



తాడికొండ: ప్రార్థనలో పాల్గొన్న భక్తులు



ఫిరంగిపురం: పాల్గొన్న భక్తులు

### ఉరేసుకుని వివాహిత మృతి

**వివాహమైన పది నెలలకే మృతి చెందిన వైనం**

**కొల్లిపర:** మండల కేంద్రం కొల్లిపర గ్రామ శివారు గుడిబండివారిపాలెంలో వివాహిత ఉరి వేసుకుని మృతి చెందింది. వివాహమైన పది నెలలకే, అందునా ఐదు నెలల గర్భవతి అయిన ఆమె మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుంటూరు రాజకుమారి (18) ఆదివారం మధ్యాహ్నం ఉరికి వేలాడుతూ మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. రాజకుమారి స్వగ్రామం భట్టిప్రోలు మండలంలోని పెదపాలెం గ్రామం. సుమారు 10 నెలల క్రితం గుడిబండివారిపాలెం గ్రామానికి చెందిన యువకుడు సుందరరాజును ప్రేమ వివాహం చేసుకుంది. ఇరు పక్షాలను ఒప్పించి పెళ్లి చేసుకున్న రాజకుమారి ప్రస్తుతం ఐదు నెలల గర్భవతి. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో భర్తతో స్వల్ప ఘర్షణ జరగడంతో లోపలికి వెళ్లి తలుపు వేసుకుని చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న రూరల్ సీఐ ఆర్. ఉమేష్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. రాజకుమారి, సుందరరాజు కుటుంబాలు చర్చలు జరుపుకొంటున్నాయి. ఆదివారం రాత్రి వరకు ఎటువంటి కేసు నమోదు కాలేదు.